క్లుప్తంగా

ప్రమాదకర మలుపు



పాన్‌గల్: మండల కేంద్రం నుంచి శాగాపూర్ వైపు వెళ్లే పీఆర్ రోడ్డుపై బాలపీర్ల దర్గా వద్ద మలుపు ప్రమాదకరంగా ఉంది. మలుపు వద్ద రోడ్డు పక్కనే వ్యవసాయ బావి ఉండటం, మలుపు వద్ద ఏపుగా చెట్లు ఉండటంతో దగ్గరికి వచ్చే వరకు మలుపు, బావి ఉన్నట్లు తెలియక ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ప్రతి నిత్యం పెద్ద సంఖ్యలో బాలపీర్ల దర్గాకు భక్తులు వాహనాల్లో వస్తుంటారు. గతంలో దర్గాకు వచ్చిన భక్తుల ట్రాక్టరు బోల్తాపడి పలువురు గాయాలపాలయ్యారు. సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి మలుపు వద్ద ఏపుగా పెరిగిన చెట్ల పొదలను తొలగించి సూచిక బోర్డు ఏర్పాటు చేయాలని ప్రయాణికులు, భక్తులు కోరుతున్నారు.

ఊకచెట్టు వాగులో చేపపిల్లల విడుదల



ఆత్మకూర్: పట్టణ శివారులోని రామన్‌పాడ్ ఊకచెట్టు వాగులో మంగళవారం మత్స్య సహకారసంఘం ఆధ్వర్యంలో చేప పిల్లలను వదిలారు. ఈసందర్భంగా సంఘం అధ్యక్షుడు అశ్విన్‌కుమార్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో 3.35 లక్షల సబ్సిడీ చేపపిల్లలను వదిలినట్లు తెలిపారు. కార్యక్రమంలో మత్స్యశాఖ అధికారులు వీరేష్, భరత్, సంఘం సభ్యులు ధర్మయ్య, వాకిటి లక్ష్మణ్, ఆనంద్, రవి, బాలస్వామి, లక్ష్మీనారాయణ, రాములు, శేఖర్, శివ, శ్రీను, మత్స్యకారులు పాల్గొన్నారు.

వైద్య శిబిరం



వనపర్తి టౌన్: మిలాద్ ఉన్ నబీ సందర్భంగా యువనాయకుడు హకీం ఆధ్వర్యంలో ఎస్‌వీఎస్ ఆస్పత్రి, మెడికల్ కళాశాల సహకారంతో మంగళవారం జిల్లా కేంద్రంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంఐఎం పెబ్బేర్ మండల అధ్యక్షుడు ఎండీ అఫ్రోజ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఉచిత వైద్య శిబిరం ద్వారా బీపీ, షుగర్, కంటి సమస్యలు, మోకాళ్ల నొప్పులు, చిన్నపిల్లలకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి, 100 మందికి పైగా మందులు అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు ఇసాక్, యూసుఫ్, హర్షద్ ముబిన్ ఆదిల్, ఇర్ఫాన్, ఇమ్రాన్, జాకీర్, ఆరీఫ్ పాల్గొన్నారు.

నిబద్ధతతో పనిచేయాలి



పెబ్బేరు రూరల్: ఇటీవల వెలువడిన కానిస్టేబుల్ పరీక్ష ఫలితాల్లో వనపర్తి మండలంలోని పెద్దగూడెం గ్రామానికి చెందిన యువకులు మల్లేష్, వెంకటేష్ యాదవ్ కానిస్టేబుల్ ఉద్యోగాలు సాధించారు. మంగళవారం గ్రామంలో వారిని సర్పంచ్ కొండన్న గ్రామస్తులతో కలిసి సన్మానించారు.

సైబర్ నేరాలపై అవగాహన అవసరం

అడ్డాకుల: సైబర్ నేరాలకు గురి కాకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని.. కనీస అవగాహన కలిగి ఉండాలని మూసాపేట ఎస్‌ఐ కె.శ్రీనివాసులు సూచించారు. మండల కేంద్రంలోని ఠాణా వద్ద మంగళవారం సైబర్ నేరాలపై జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మొబైల్ ఫోన్లకు వచ్చే లింకులను ఎవరు ఓపెన్ చేయవద్దని సూచించారు. ఓటీపీలను ఎవరితోనూ షేర్ చేసుకోవద్దని చెప్పారు. సైబర్ నేరానికి గురైతే 1930 లేదా 100 నంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు. బ్యాంకు ఖాతాలో డబ్బులను పోగొట్టుకున్న వారు 24 గంటలలోపు ఫిర్యాదు చేస్తే డబ్బులను రీకవరి చేసే అవకాశం ఉందని తెలిపారు. కార్యక్రమంలో పోలీసులు కృష్ణ, సురేష్ తదితరులు ఉన్నారు.



పంటకు సాగునీరు అందేనా..?

- ఎంజే-4 కాల్వ ఆయకట్టు కింద ఎండముఖం పడుతున్న వరి పంటలు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు
- ఆందోళనలో రైతులు



దావాజిపల్లి సమీపంలోని ఎంజే-4 కాల్వలో పేరుకుపోయిన జమ్ము



ప్రధాన కాల్వ సమీపంలో అడ్డుగా పెట్టిన రాళ్లు

పాన్‌గల్: రైతులు సాగుచేసిన పంటలు ఎండిపోకుండా చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందిస్తామని ప్రజాప్రతినిధులు పేర్కొనడంతో యాసంగిలో చాలా మంది రైతులు వరి పంటలను సాగుచేశారు. సాగు చేసిన పంటలకునీరు సక్రమంగా అందక పంటలు ఎండుముఖం పడుతున్నట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలోని దావాజిపల్లి, దొండాయిపల్లి గ్రామాలకు సాగునీరు అందించే కేఎల్‌ఐ డీ-8 మైనర్ ఎంజే-4 కాల్వకు సాగునీరు సక్రమంగా రాక నానా అవస్థలు పడుతున్నట్లు ఆయా గ్రామాల రైతులు వాపోతున్నారు. ఈ రెండు గ్రామాల్లో కలిపి 693 ఎకరాల్లో వరి పంటలను సాగు చేశారు. ఇందులో 50 శాతం మంది రైతులు బోరు బావులు, మిగతా 50 శాతం కాల్వలపై ఆధారపడి పంటలను సాగు చేశారు. వందల ఎకరాల్లో సాగుచేసిన వరి పంటలు ఎండుమొఖం పడుతున్నట్లు రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. మండలంలోని రేమద్దుల సమీపంలోని ప్రధాన కాల్వ ద్వారా మైనర్ కాల్వకు అందే సాగునీరును చివరి ఆయకట్టు గ్రామాలకు వెళ్లకుండా ప్రధాన కాల్వ సమీపంలోని గ్రామాల రైతులు మోటార్లు, కాల్వకు అడ్డుగా రాళ్లు పెడుతుండటంతో చివరి ఆయకట్టు గ్రామాలకు సాగునీరు సక్రమంగా పారడం లేదు. చివరి ఆయకట్టు గ్రామాల రైతులు కాల్వ వెంట కాపాలా కాస్తూ సాగునీరును ముందుకు తీసుకెళ్లే ప్రయత్నం చేస్తున్నా ప్రయోజనం లేదంటున్నారు. దీంతో పాటు కాల్వలో పేరుకపోయిన జమ్ము, పూడిక సక్రమంగా తొలగించకపోవడంతో వచ్చే సాగునీరు కూడా సాఫీగా రావడం లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు. రూ.వేలు ఖర్చు చేసి పంటలను సాగు చేసుకుంటే వచ్చే సాగునీరు సక్రమంగా రాకపోవడంతో తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందని రైతులు వాపోతున్నారు. సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి చివరి ఆయకట్టు గ్రామాలకు సాఫీగా సాగునీరు ప్రవహించే విధంగా తగు చర్యలు తీసుకుంటూ పంటలు ఎండిపోకుండా చూడాలని రైతులు కోరుతున్నారు.

'దళితబంధు'లో పేదలకు అన్యాయం



రేవల్లి మండలంలోని నాగపూర్‌లో ధర్నా చేస్తున్న దళితులు

గోపాల్‌పేట: దళితబంధు పథకాన్ని నిజమైన అర్హులకు కేటాయిస్తే ప్రభుత్వానికి పేరు వస్తుంది కానీ అన్ని వసతులు ఉన్నవారికి ఇస్తే పార్టీ నష్టపోయే ప్రమాదం ఉందని నాగపూర్ దళితులు అన్నారు. మంగళవారం వారు రేవల్లి మండలంలోని నాగపూర్ కూడలి వద్ద అర్హులకు మాత్రమే దళితబంధు ఇవ్వాలని ధర్నాకు దిగారు. సుమారు రెండు గంటల పాటు రోడ్డుపై బైఠాయించడంతో వాహనదారులు ఇబ్బందులకు గురయ్యారు. దీంతో సమాచారం అందుకున్న పోలీసులు ధర్నా వద్దకు చేరుకుని ఏదైనా సమస్య ఉంటే ప్రజాప్రతినిధులు, అధికారులతో మాట్లాడాలని, ట్రాఫిక్ అంతరాయం కలిగించొద్దని సూచించారు. దీంతో వారు ధర్నాను విరమించారు.

రుణమాఫీలో గందరగోళం తొలగించాలి



మాట్లాడుతున్న సత్యారెడ్డి

కొత్తకోట రూరల్: ఐదేళ్ల క్రితం ఎన్నికల్లో రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన రైతు రుణమాఫీ నేటికీ పూర్తి స్థాయిలో అమలు చేయకపోవడంతో రైతుల్లో నెలకొన్న గందరగోళాన్ని తొలగించాలని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు సత్యారెడ్డి అధికారులకు విజ్ఞప్తి చేశారు. మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సత్యారెడ్డి మాట్లాడుతూ 2018 నాటికి రూ.లక్ష రుణమాఫీ ఎలాంటి అడ్డంకులు లేకుండా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఇద్దరు అన్నదమ్ములు ఉంటే 2018 ముందే వేరువేరుగా ఉన్న వారికి రూ.లక్ష రుణమాఫీ కావడం లేదని, ఏ అధికారిని అడిగినా సరైన సమాధానం రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి రోజు రైతులు బ్యాంకుల చుట్టూ తిరిగి విసిగిపోయిన పరిస్థితి దాపురించిందన్నారు. ప్రభుత్వం ప్రకటించిన విధంగా రుణమాఫీకి అర్హత ఉన్న రైతులకు రుణమాఫీ కావడం లేదని దుయ్యబట్టారు. రుణమాఫీ అయిన రైతులకు బ్యాంకర్లు రుణాలు ఇవ్వకపోవడంతో వారు వడ్డీ వ్యాపారులను ఆశ్రయిస్తున్నారని, దీంతో రైతులు తీవ్రంగా నష్టపోతారని వాపోయారు. కార్యక్రమంలో విజయభాస్కర్‌రెడ్డి, రంగారెడ్డి, ముజఫర్ తదితరులు ఉన్నారు.

జిల్లా సరిహద్దుల్లో నిఘా పటిష్టం



నాగల్‌కడ్మూర్‌లో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు



కొత్తకోట సమీపంలో వాహనాలను తనిఖీలు చేస్తున్న ఎస్‌ఐ మంజునాథ్‌రెడ్డి

అమరచింత: ఎన్నికల కోడ్ అమలు ఉన్నందున జిల్లా సరిహద్దు గ్రామాల్లో ప్రత్యేక చెక్ పోస్టులను ఏర్పాటు చేసి నిఘాను పటిష్టం చేస్తున్నామని ఎస్‌ఐ జగన్మోహన్ తెలిపారు. మండలంలోని నాగల్‌కడ్మూర్‌లో చెక్‌పోస్టును మంగళవారం ఏర్పాటు చేశామన్నారు. నారాయణపేట జిల్లాతో సరిహద్దు ఉండటంతో చెక్‌పోస్టు ఏర్పాటు చేసి వాహన తనిఖీలతో పాటు మద్యం రవాణాను అడ్డుకోనేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు.

ముమ్మరంగా వాహనాల తనిఖీలు

కొత్తకోట రూరల్: ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన నేపథ్యంలో రెండు రోజులుగా కొత్తకోట మీదుగా నుంచి హైదరాబాద్ వెళ్తున్న వాహనాలను, హైదరాబాద్ వైపు నుంచి కొత్తకోటకు వచ్చిపోయే వాహనాలను ఎస్‌ఐ మంజునాథ్‌రెడ్డి తన సిబ్బందితో క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. వాహనాల్లో డబ్బులు, మద్యం తరలించొద్దని, రూ.50వేల కంటే ఎక్కువ డబ్బులు తరలిస్తే ఆధారాలు చూపించాలన్నారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ మంజునాథ్‌రెడ్డి హెచ్చరించారు.

విద్యుత్ సమస్య పరిష్కరించాలి

చిన్నంబావి: మండలంలోని కాలురు, అయ్యవారిపల్లి, చెల్లపాడు, వెల్టూరు గ్రామాల్లో త్రీఫేజ్ కరెంట్ లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే సమస్యను పరిష్కరించాలని సింగిల్‌విండో వైస్ చైర్మెన్ విద్యసాగర్‌రావు ఒక ప్రకటనలో అధికారులను కోరారు. ఆయన మాట్లాడుతూ సాగునీరు లేక పంటలు ఎండిపోతుంటే అధికారులు ఏమాత్రం స్పందించకపోవడం దారుణమన్నారు. ప్రభుత్వం 24గంటలు కరెంట్ ఇస్తున్నామని ప్రగల్బాలు పలకడం కాదని ఒక్కసారి చిన్నంబావి మండలానికి వస్తే సమస్య తెలుస్తుందన్నారు. విద్యుత్ సమస్య పరిష్కారం కోసం అధికారులు సత్వరమే కృషి చేయాలని కోరారు.

వ్యక్తిపై కేసు నమోదు

గోపాల్‌పేట: రేవల్లి మండల కేంద్రంలో సారా అమ్ముతున్నారన్న సమాచారం అందడంతో మండల కేంద్రానికి చెందిన గడ్డల కృష్ణయ్య షాపు వద్ద తనిఖీ చేయగా సారా దొరికింది. దీంతో అతడిపై కేసు నమోదు చేశామని రేవల్లి ఎస్‌ఐ శివకుమార్ తెలిపారు. ఎవరైనా అక్రమంగా కల్లు, సారా విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్ హెచ్చరించారు.

బ్యాంక్ సేవలపై అవగాహన అవసరం

కొల్లాపూర్: పట్టణంలోని గాయత్రి జూనియర్ కళాశాలలో బ్యాంకు స్కీంలు, లావాదేవీలపై ఏపీజీవీబీ బ్యాంకు అధికారులు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బ్యాంకు మేనేజర్ ఉదయ్‌కుమార్ మాట్లాడుతూ రైతులకు, విద్యార్థులకు అందించే పథకాలను వివరించారు. కార్యక్రమంలో సురగాని శ్రీనివాస్‌గౌడ్, కళాశాల అధ్యాపకులు ఉన్నారు.

పెంట్లవెల్లి: ప్రతి ఒక్కరికి బ్యాంక్ సేవలపై అవగాహన ఉండాలని ఏపీజీవీబీ మేనేజర్ రాంగోపాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని కొండూరులో రుణాలు, ఇన్సూరెన్స్, ఎడ్యుకేషన్ లోన్ కళాజాతా నిర్వహించారు. ఈ సందర్భంగా బ్యాంక్ మేనేజర్ మాట్లాడుతూ ప్రధానమంత్రి సురక్ష బీమాయోజన, జీవనజ్యోతి, అటల్ పెన్షన్ యోజన, సైబర్‌మోసాల అవగాహన కల్పించారు. సైబర్ నేరాగాళ్లతో అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ గోపాల్, మేనేజర్ రాంగోపాల్, బ్యాంక్ సిబ్బంది దామోదర్, విజయ్, కళాకారులు పాల్గొన్నారు.

నిబంధనలు ఉల్లంఘించొద్దు

కొల్లాపూర్: ఫర్టిలైజర్ దుకాణ యజమానులు నిబంధనలు ఉల్లంఘించొద్దని ఏఓ నాగరాజు అన్నారు. మంగళవారం పట్టణంలో ఫర్టిలైజర్ దుకాణంలో ఎరువుల విక్రయాలకు సంబంధించిన రికార్డులను తనిఖీ చేశారు. ఎరువులను ఆన్‌లైన్‌లో పీఓఎస్ మిషన్ ద్వారా మాత్రమే అమ్మాలని డీలర్లకు సూచించారు. అధిక ధరలకు ఎరువులను విక్రయిస్తే దుకాణాల లైసెన్సులను రద్దుచేస్తామని హెచ్చరించారు. స్టాక్ రిజిస్టర్, బిల్‌బుక్ తప్పకుండా మెయింటెన్ చేయాలని ఆయన సూచించారు.

సుద్దాల హనుమంతుకు ఘన నివాళి



హనుమంతు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కవులు, నాయకులు

వనపర్తి టౌన్: ఓ చేతితో కలాన్ని, మరో చేతితో గన్ను పట్టుకొని తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటాన్ని ముందుకు నడిపిన గొప్ప వ్యక్తి సుద్దాల హనుమంతు అని ప్రజావాగ్గేయకారుడు రాజారామ్‌ప్రకాశ్ అన్నారు. హనుమంతు 41వ వర్ధంతిని పురస్కరించుకొని మంగళవారం జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో టీజేఏసీ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాజారామ్‌ప్రకాశ్ మాట్లాడుతూ.. నిజాం నిరంకుశ పాలనను, దోపిడీ దారుల దారుణాలను ఎదిరించి, వారి పాలనను అంతమొందించేందుకు నిరంతరం కృషి చేశాడని గుర్తుచేశారు. కళానికి, గళం తోడు చేసి కవిత్వాలతో పోరాట స్ఫూర్తి నింపి నిజాం పాలనకు ఎదురెళ్లారని కొనియాడారు. కార్యక్రమంలో కవులు గిరిరాజాచారి, వ్యాఖ్యాత డాక్టర్ నాయకంటి నరసింహశర్మ, జిల్లా ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యుడు గంధం నాగరాజు, మండ్ల దేవన్న నాయుడు, గద్వాల కృష్ణ, వెంకటేష్, కురుమయ్య, రాబర్ట్, వెంకటస్వామి, దప్పు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

సీజ్ చేసిన ఇసుకకు రక్షణ కరువు



ఇసుక నిల్వ

అమరచింత: తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో డంప్ చేసిన ఇసుకను అక్రమంగా ఎద్దుల బండిపై తరలిస్తున్నా అరికట్టలేని స్థితిలో అధికారులు తయారయ్యారు. అమరచింతకు అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పోలీసులు సీజ్ చేసి ఇసుకను తహసీల్దార్ కార్యాలయ ఆవరణంలో డంప్ చేశారు. మహబూబ్‌నగర్ జిల్లా చిన్నచింతకుంట మండలం మద్దూర్ గ్రామానికి చెందిన వ్యక్తులు ట్రాక్టర్లతో ఇసుకను అక్రమంగా రవాణా చేస్తుండగా వాటిని పట్టుకొని కేసు నమోదు చేశారు. ఇసుకను తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో డంప్ చేశారు. వీటిని చలాన్ కట్టి తీసుకెళ్లాల్సి ఉండగా.. కేసు నమోదు అయిన వ్యక్తులే ఎడ్లబండ్లు తీసుకొచ్చి ఇసుకను తీసుకెళ్లారు. సదరు వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

నిజాయితీ చాటుకున్న కండక్టర్

పెద్దకొత్తపల్లి: నాగర్‌కర్నూల్ డిపోలో విధులు నిర్వర్తిస్తున్న కండక్టర్ శ్రీనివాస్ నిజాయితీని చాటుకున్నాడు. పెద్దపల్లి గ్రామానికి చెందిన ఎల్లమ్మ డిపోకు చెందిన ఆర్‌టీసీ బస్సులో నాగర్‌కర్నూల్ నుంచి పెద్దముద్దునూర్‌కు వెళ్తోంది. హడావుడిలో ఎల్లమ్మ పర్సు బస్సులో కిందపడింది. గమనించిన బస్సు కండక్టర్ పర్సులో రూ.800లు, కాళ్లమెట్టెలు, తాళిబొట్టు ఉన్నట్లు గుర్తించాడు. దీంతో పెద్దకొత్తపల్లిలో ఆర్‌టీసీ బస్సు కంట్రోలర్ నిరంజన్‌ను బాధితురాలి పర్సును అందజేశాడు. అధికారులు ప్రయాణికురాలికి సమాచారం ఇవ్వగా మండల కేంద్రంలోని కంట్రోలర్‌ను సంప్రదించింది. దీంతో ప్రయాణికురాలు ఎల్లమ్మకు పర్సును అప్పగించారు. నిజాయితీని చాటుకున్న కండక్టర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

అమరవీరుల త్యాగానికి వందనం



పాతపల్లిలో మట్టి సేకరిస్తున్న బీజేపీ నాయకులు



వనపర్తిలో..

వనపర్తి టౌన్: ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆదేశానుసారం మేరా దేశ్ మేరా మట్టి కార్యక్రమంలో భాగంగా మంగళవారం జిల్లా కేంద్రంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు బచ్చు రాము ఆధ్వర్యంలో ఇంటింటి నుంచి మట్టి సేకరించారు. ఈ మేరకు నియోజకవర్గ కన్వీనర్ శ్రీనివాస్‌గౌడ్, జిల్లా అధ్యక్షుడు రాజవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ.. నెల రోజుల నుంచి వనపర్తిలోని 33 వార్డులు, 9 మండలాల్లోని అన్ని గ్రామాల నుంచి సేకరించిన మట్టిని జిల్లా కార్యాలయంలో ఓ కలశంలో నింపి రాష్ట్ర కార్యాలయానికి తరలించినట్లు తెలిపారు. రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల నుంచి సేకరించిన మట్టిని రాష్ట్ర కార్యాలయం నుంచి ఢిల్లీకి తరలిస్తారన్నారు. దేశ రక్షణలో ప్రాణాలు కోల్పోయిన అమరవీరుల ప్రాణత్యాగానికి గుర్తుగా ఈ కార్యక్రమం చేపడుతున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో కృష్ణయ్య, శ్రీనివాస్‌గౌడ్, నారాయణ, వెంకటేశ్వర్‌రెడ్డి, ప్రభాకర్, రామారావు తదితరులు పాల్గొన్నారు.

పెబ్బేరు రూరల్: మండలంలోని పాతపల్లిలో మేరా దేశ్.. మేరా మట్టి కార్యక్రమాన్ని మంగళవారం స్థానిక బీజేపీ నాయకులు నిర్వహించారు. గ్రామంలో తిరుగుతూ గ్రామస్తులతో మట్టి బియ్యం సేకరించారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు భగవంతుయాదవ్ పాల్గొన్నారు.

ప్రజల్లో వ్యతిరేకత పెరిగింది

అడ్డాకుల: గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా మోసం చేసిన బీఆర్‌ఎస్‌పై ప్రజల్లో వ్యతిరేకత పెరిగిందని బీజేపీ జిల్లా ఇన్‌చార్జ్ ఏవీఎన్ రాజు అన్నారు. మండల కేంద్రంలోని మాజీ ఎంపీ జితేందర్‌రెడ్డి గెస్టుహౌస్‌లో మంగళవారం జరిగిన నియోజకవర్గ ముఖ్య నాయకుల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల్లో అనుసరించాల్సిన విషయాలపై జిల్లా అధ్యక్షుడు వీరబ్రహ్మచారి, నియోజకవర్గ నాయకులు ఎగ్గని నర్సిములు, సుదర్శన్‌రెడ్డి, బాలమణెమ్మ, జిల్లా ప్రధాన కార్యదర్శులు నంబిరాజు, మాధవరెడ్డిలతో చర్చించారు. బీఆర్‌ఎస్‌పై ఉన్న వ్యతిరేకతను అనుకూలంగా మార్చుకుని ఎన్నికల్లో విజయం సాధించే దిశగా ముందుకు సాగాలని అన్నారు. ఈ సందర్భంగా మేరా మిట్టి మేరా దేశ్ అమృత కలశాన్ని జిల్లా అధ్యక్షుడికి అందజేశారు. ఈనెల 11 నుంచి 30వ తేదీ వరకు చేపట్టాల్సిన కార్యాచరణ గురించి చర్చించారు. కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి మున్నూర్ రమేష్, రాజేందర్‌రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, రవీందర్‌గౌడ్, రాంరెడ్డి, రవీందర్, దశరత, కోటేశ్వర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

ఉష్ణతాపం.. పిల్ల కాల్వల్లో ఈత సరదా



అమరచింత: వానకాలం తర్వాత చలికాలం వస్తే చలితో వణికిపోతుంటాం. కానీ వర్షాకాలంలో వాతావరణం అనుకూలించని కారణంగా వర్షాలు సక్రమంగా కురవలేదు. దీంతో భానుడి తన ప్రతాపం చూపుతుండడంతో వాతావరణం వేడెక్కుతున్నది. చిన్నారులు ఉష్ణతాపానికి ఉపసమనం కోసం పిల్ల కాల్వలలో ఈత పడుతూ శరీరాన్ని చల్లబర్చుకుంటున్నారు. ప్రస్తుతం పాఠశాలలో పరీక్షలు ఉదయం, మధ్యాహ్నం సమయాల్లో తరగతుల వారీగా ఉండటంతో పట్టణానికి చెందిన చిన్నారులు ఎత్తిపోథల పిల్ల కాల్వలో పారే నీటిలో ఈత పడుతూ సరదాగా కేరింతలు కొడుతున్న దృశ్యం 'సాక్షి'కి చిక్కింది.

మొక్కల సంరక్షణలో నిర్లక్ష్యం సరికాదు

కోడేరు: మొక్కల పెంపకంలో నిర్లక్ష్యం చేస్తే చర్యలు తీసుకుంటామని ఎంపీడీఓ బాలచందర్‌సృజన హెచ్చరించారు. మంగళవారం మండలంలోని మైలారంలో హరితహారం మొక్కలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్లకు ఇరువైపులా నాటిన మొక్కలు ఎండిపోకుండ చూడాలని, ఎండ తీవ్రత పెరిగినందున జాగ్రత్తలు తీసుకోవాలని సర్పంచ్, పంచాయతీ సిబ్బందికి సూచించారు. ఎప్పటికప్పుడు ఏపీఓ మొక్కలను పర్యవేక్షణ చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏపీఓ మోహన్‌కృష్ణ, పంచాయతీ కార్యదర్శి వెంకటేష్, శివ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ హయాంలోనే సంక్షేమ ఫలాలు



మదనాపురంలో పార్టీలో చేరిన నాయకులతో జీఎమ్మార్

మదనాపురం: కాంగ్రెస్ పార్టీ దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ హయాంలో ప్రతి పేద కుటుంబానికి మేలు జరిగగిందని, మళ్లీ రాజన్న రాజ్యం రావాలంటే కాంగ్రెస్ అధికారంలోకి వస్తేనే సాధ్యమని మహబూబ్‌నగర్ డీసీసీ అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన 70 మంది కార్యకర్తలు కాంగ్రెస్‌లోకి చేరగా వారికి కండువాలు కప్పి వారిని పార్టీలోకి ఆహ్వానించారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

అనారోగ్యంతో బాధపడుతున్న సీనియర్ కాంగ్రెస్ నాయకుడు వడ్డె పెద్ద కుర్మన్నను వారి నివాసంలో కలిసి పరామర్శించారు. అంతకు ముందు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి ర్యాలీ చేశారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు వడ్డె కృష్ణ, టీపీసీసీ ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రశాంత్, డీసీసీ కార్యదర్శి బోయేజ్, నరేందర్‌రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి జగదీశ్, ఖాజమైనోద్దీన్, సాయిబాబా, తిర్మాలయపల్లి రాములు, బాలు, రామకృష్ణ, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సన్మానం

కొత్తకోట: ఇటీవల వెలువడిన కానిస్టేబుల్స్ పరీక్ష ఫలితాల్లో పట్టణ కేంద్రానికి చెందిన స్వాతి, భానుప్రకాష్ దంపతులతో పాటు మరికొందరు కానిస్టేబుళ్లుగా ఎంపికయ్యారు. వీరందరిని మహబూబ్ నగర్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జి.మధుసూదన్‌రెడ్డి శాలువాలతో సన్మానించారు. రానున్న రోజుల్లో ఉన్నత ఉద్యోగాలు సాధించాలని ఆయన ఆకాంక్షించారు. బోయేజ్, గొల్లబాబు, మేస్త్రీ శ్రీనివాసులు, ఎల్లంపల్లి నరేందర్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, శ్యామ్ తదితరులు ఉన్నారు.

బ్యానర్‌పై సంతకాల సేకరణ

పెబ్బేరు రూరల్: తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం వనపర్తి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా కేంద్రంలో బ్యానర్‌పై సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి మేకల ఆంజనేయులు మాట్లాడుతూ దేశంలో రెండోసారి బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత అట్టడుగు వర్గాలైన దళిత, గిరిజన మహిళలు, ఇతర పేదలపై దాడులు, హత్యలు, అత్యాచారాలు పెరిగాయని ఆందోళన వ్యక్తం చేశారు. వాటిని అరికట్టాలని, రాజ్యాంగ హక్కులను అమలు చేయాలని కోరుతూ రాష్ట్రపతికి అందించడానికి సంతకాల సేకరణ చేపట్టామని తెలిపారు. జిల్లా కేంద్రంలో జరుగుతున్న సంతకాల సేకరణలో ప్రజలంతా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో మదన్, గంధం చిన్నగట్టయ్య, నారాయణ, శ్రీనివాసులు, గట్టయ్య, శేషన్న, జయ్యమ్మ, గంధం రాజు పాల్గొన్నారు.

